సాక్షి
బాపట్ల
మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024




స్వామివారికి పుష్పయాగం

తెనాలిటౌన్: వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి తెనాలి తాలూకా హైస్కూల్ గ్రౌండ్‌లో స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు.



సాతులూరులో వసంతోత్సవం

నాదెండ్ల: సాతులూరులో గ్రామ దేవతల ఆలయాల తొమ్మిదో వార్షికోత్సవం పురస్కరించుకుని సోమవారం వసంతోత్సవం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 518.80 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 3,788 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

పులిచింతల నిర్వాసితులకు రిజిస్ట్రేషన్ ఫీజు లేదు

పిడుగురాళ్ల: పులిచింతల పునరావాస కేంద్రాల్లోని వారికి రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల కోసం స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీలు పూర్తిగా మినహాయింపు ఇచ్చిందని, ప్రజలు సద్వినియోగించుకోవాలని పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ కె.శ్రీరాములు, పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ ఏ.టీ.రాజ్యలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పిడుగురాళ్ల పరిసర ప్రాంతాల్లోని పులిచింతల పునరావాస క్రేందాలకు చెందిన నిర్వాసితులు వారి నివాసాలకు సంబంధించిన స్థలాలను, గృహాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ దస్తావేజులకు సంబంధించి ఎటువంటి ఫీజులు చెల్లించనవసరం లేదని, మధ్యవర్తులు, దళారుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, సందేహాలు ఉంటే నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఈ అవకాశాన్ని పులిచింతల నిర్వాసితులందరూ సద్వినియోగించుకోవాలని కోరారు.

యార్డుకు 98,671 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 98,671 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 88,652 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.19,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 80,882 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

నేడు 'చలో అసెంబ్లీ'కి అనుమతి లేదు

నగరంపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం సమస్యల పరిష్కారానికి మంగళవారం తలపెట్టిన 'చలో అసెంబ్లీ'కి ఎటువంటి అనుమతుల్లేవని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని ఆసరా చేసుకుని, కొన్ని అసాంఘిక శక్తులు శాంతి భద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా అనుమతుల్లేవని స్పష్టంచేశారు. తుళ్లూరు సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ చట్టం అమల్లో ఉందని తెలిపారు. ఎవరైనా పోలీసుల ఆదేశాలను విస్మరించి, హాజరైతే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ చెప్పారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

రైల్వే బోర్డు చైర్‌పర్సన్‌కు ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: విజయవాడ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో చాలా ఏళ్లుగా ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ ఎంపీలు, ఎమ్మెల్యే రైల్వేబోర్డు చైర్ పర్సన్‌కు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో సోమవారం ఎంపీలు అయోధ్యరామిరెడ్డి, కేశినేని శ్రీనివాస్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, జగయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కుమారుడు ప్రసాద్ రైల్వేబోర్డు చైర్ పర్సన్ జయవర్మ సిన్హాకు వినతిపత్రం ఇచ్చారు. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని విజయవాడ–గుడివాడ, విజయవాడ నార్త్ క్యాబిన్–గుండాల స్టేషన్–బల్బ్ క్యాబిన్‌ల మధ్య రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, విజయవాడ–హౌరా రైల్వేట్రాక్ పనులు సత్వరమే పూర్తిచేయాలని కోరారు. సింగ్‌నగర్–రామకృష్ణాపురం–విజయవాడ–హౌరా రైల్వేట్రాక్ ఆర్‌యూబీ మధ్య పెరిగిన వాహనరద్దీకి అనుగుణంగా అదనంగా బాక్స్ వెంట్‌ల ఏర్పాటు పనులు పూర్తిచేయాలన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4600, గరిష్ట ధర రూ.6000, మోడల్ ధర రూ.5300 వరకు పలికింది.

నోరు కొట్టి.. కోట్లు కొల్లగొట్టి!

సీ మౌత్‌ను మూసివేసి అక్రమ లే అవుట్లు

- సముద్రం ఒడ్డున రియల్ దొంగలు
- భారీగా ఇసుక తవ్వకాలు
- రిసార్టులకు ఉపయోగకరమంటూ ప్రజలను మోసగిస్తున్న రియల్టర్లు
- రైతులు, మత్స్యకారులకు తీవ్రనష్టం



సముద్రాన్ని ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన రిసార్టు



సీ మౌత్ నుంచి తెచ్చిన ఇసుకతో లెవలింగ్ చేసిన భూమి

చీరాల: కాదేదీ దోపిడీకి అనర్హం అన్నట్లు రియల్టర్లు బరి తెగిస్తున్నారు. తీర ప్రాంతానికి అతి ముఖ్యమైన సీ మౌత్‌ను మూసివేసి అక్రమ లేఅవుట్లు పెట్టి, ఇసుకను సైతం దోచేస్తున్నారు. తుపాన్లు, భారీ వర్షాలు, ఇతర ప్రకృతి విపత్తుల సంభవించినప్పుడు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు సముద్రంలో కలిసే ప్రాంతం. వేలాది ఊర్లను లక్షలాది ఎకరాల పొలాలను కాపాడే ఏకైన వనరు సీ మౌత్. అంతటి ప్రాధాన్యం కలిగిన ప్రాంతంలో సైతం కొందరు రియల్టర్లు ఇసుకను టన్నులకొద్దీ తోడేశారు. అంతటితో ఆగకుండా దానిని ప్లాట్లుగా వేసి భవిష్యత్‌లో ఇక్కడ బీచ్ రిసార్టులకు అవకాశం ఉందని స్థానికులతో పాటుగా ఇతర ప్రాంత వాసులను నమ్మించి ఎకరాకు రూ.3కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు సొమ్ము చేసుకుంటున్నారు.

భారీగా అక్రమ లే అవుట్లు..

ఈ లేఅవుట్లకు భూ మార్పిడి, పంచాయతీల భూ బదలాయింపు, ప్రభుత్వానికి కట్టాల్సిన రిజిస్ట్రేషన్ పన్నులు చెల్లించకుండా ప్రభుత్వ ధనాన్ని లూటీ చేస్తున్నారు. ఇటీవల బుర్లవారిపాలేనికి చెందిన కొందరు వ్యాపారులు భారీగా అక్రమ లేఅవుట్లు వేశారు. ఉన్నతాధికారులు మాత్రం తాము చూసీచూడనట్లు వ్యవహరించడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. దీంతో పాటుగా సీఆర్‌జెడ్ (కోస్టల్ రెగ్యులరీ జోన్) నిబంధనలు పాటించకపోవడంతో వాటికి కనీసం బ్యాంకు నుంచి రుణ సౌకర్యాలు అందడం లేదు. ఇవన్నీ తెలియక కొనుగోలు చేసిన వారు అడ్డంగా బుక్కవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సముద్రాన్ని ఆనుకునే విశాలంగా విల్లాలు, రిసార్టులు అడ్డగోలుగా కడుతున్నారు.

ఇసుకను తోడేస్తున్న పచ్చ నేతలు..

అక్రమార్కులు బరితెగించి సముద్రాన్ని కూడా వదలడం లేదు. ఈపురుపాలెం స్ట్రయిట్ కట్‌లో కలిసే సీమౌత్‌ను మూసి వేసి అటు రైతులకు, ఇటు మత్స్యకారులకు ఇబ్బందులు కలిగేలా వ్యవరిస్తున్నారు. ఉప్పునీటిని బయటకు రాకుండా ఆపి పంట కాలువలోకి సముద్రం నీరు రాకుండా అడ్డుకునే ఇసుక తిన్నెలు కనుమరుగయ్యాయి. పిట్టువారిపాలేనికి చెందిన టీడీపీ నాయకులు, పట్టణంలో ఆక్వా రైతుగా చలామణి అవుతున్న వ్యక్తి, మరికొందరు తీరప్రాంత ఇసుకను కొల్లగొట్టి రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు.

భవిష్యత్తు ప్రశ్నార్థకం..

ఆయకట్టు భూముల రైతులు, సముద్రాన్ని నమ్ముకుని జీవనం సాగించే మత్స్యకారుల భవిష్యత్తుకు విఘాతం కలిగేలా సీమౌత్ మూసేసి అక్రమంగా ఇసుకను దోచేస్తున్నారు. దీంతో తరచుగా వచ్చే తుఫాన్లు, భారీ వర్షాల సమయంలో సముద్రపు నీరు స్ట్రయిట్‌కట్ గుండా బయటకు వస్తే అటు రైతులు ఇటు మత్స్యకారులు బోట్లు నిలుపుదల చేసే జెట్టీ వద్ద ఉధృతి పెరిగి తీవ్ర నష్టాలు జరుగుతాయి. కొమ్మమూరు కాలువ నుంచి వచ్చే నీటితో చీరాల మండలంలోని గ్రామాల్లోని ఎత్తిపోతల పథకాల ద్వారా పంటల సాగు చేస్తారు. గవినివారిపాలెం, అక్కాయిపాలెం, తోటవారిపాలెం ఎత్తిపోతల పథకాల కింద వేలాది ఎకరాల పంట భూములు సాగు అవుతాయి. అక్రమార్కులు సీ మౌత్‌ను మూసి వేయడంతో స్ట్రయిట్‌కట్ కాలువకు ఉప్పునీరు రావడంతో వేలాది ఎకరాల్లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారుతుంది.

జోరుగా ప్లాట్ల విక్రయాలు..

తీరాన్ని అక్రమార్కులు జోరుగా దోచేస్తున్నారు. కళ్ల ముందు ఎకరాలకు ఎకరాలు వెంచర్లు వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి భూ బదాలాయింపు, ఎన్‌ఓసీలు లేకుండా వెంచర్లు వేసి ప్లాట్లు లెక్కన అమ్మకాలు చేస్తున్నారు. సీమౌత్ నుంచి తీసిన ఇసుకను పొలాల్లో వేసి లెవలింగ్ చేస్తున్నారు. మండలంలోని పిట్టువారిపాలెం, గవినివారిపాలెం, బుర్లవారిపాలెం, వాడరేవు సముద్రం ఒడ్డున ప్రాంతాల్లో బడా రియల్టర్లు భారీగా వెంచర్లు వేశారు. అంతేగాక సీఆర్‌జెడ్ నిబంధనలను పట్టించుకోకుండా తీరం ఒడ్డునే విలాసవంతమైన రిసార్టులు, విల్లాలు, శాశ్వత నిర్మాణాలు చేస్తున్నారు. ప్లాట్ల విక్రయాలకు ప్రభుత్వ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే పొలాన్ని ప్లాట్లుగా విభజించి అమ్మకాలు చేస్తు రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. తీరప్రాంతం అంతా అక్రమ వ్యాపారాలు చేస్తున్న 'రావులు', మరి కొందరిపై అధికారులు ఉదాసీనంగా, పట్టీపట్టనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది.

అక్రమ లే అవుట్లకు హద్దే లేదు..

చీరాల తీరప్రాంతాన్ని అక్రమార్కులు అడ్డాగా మార్చుకున్నారు. తీరం ఒడ్డున పది సెంట్ల స్థలం నుంచి పది ఎకరాల వరకు వెంచర్లు వేసి మరీ దోచుకుతింటున్నారు. ఆకాశమే హద్దు మాదిరిగా అధికారులను ప్రసన్నం చేసుకుని లే అవుట్లు వేసి రూ.కోట్లు గడిస్తున్నారు. గవినివారిపాలెం పంచాయతీలోని విజయలక్ష్మీపురం, కొత్తపాలెం, వాడరేవు నుంచి రామాపురం, కఠారిపాలెం, తీరప్రాంత గ్రామాల్లో అక్రమ లేవుట్లు వేస్తున్నారు. అక్రమార్కులకు రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారనే ప్రచారం జరుగుతోంది.

వివరాలు కనుక్కొని చర్యలు తీసుకుంటాం..

తీర ప్రాంత గ్రామాల్లో వెంచర్లు వేస్తున్న విషయం నాకు తెలీదు. సీ మౌత్‌ను ఎవరు మూసేశారో ఎంతమేరకు ఇసుకను కొల్లగొట్టారో కనుక్కుంటాం. అక్రమాలపై నాకు ఎలాంటి సమాచారం లేదు. తహసీల్దార్ల నుంచి సమాచారాన్ని, అన్ని వివరాలు, భూ బదలాయింపు, ఎన్‌ఓసీ ఇచ్చారో లేదో తెలుసుకుంటాం. అక్రమాలపై తగు చర్యలు తీసుకుంటాం.

– పి.సరోజిని, ఆర్డీఓ, చీరాల

అర్జీలు గడువులోపు పరిష్కరించండి

జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల అర్బన్: స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలు గడువులోగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. క్షేత్రస్థాయిలో వస్తున్న అర్జీలు సక్రమంగా పరిష్కరించకపోవడంతోనే పునరావృతం అవుతున్నాయన్నారు. జిల్లా పంచాయతీ శాఖలో మూడు అర్జీలు పునరావృతం కాగా, ఆర్డీఓల వద్ద రెండు చొప్పున పెండింగ్‌లో ఉండడంపై ఆరా తీశారు. సర్వే ల్యాండ్స్ రికార్డు వద్ద మూడు, విద్యుత్ శాఖలో రెండు, ఇలా వివిధ శాఖల్లో మరికొన్ని పునరావృతమైనవి పెండింగ్‌లో ఉండడంపై సమీక్షించారు. అధికారులు అందరిని సమన్వయం చేసుకుంటూ సమర్థంగా పనిచేయాలని సూచించారు.

9న గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలి..

గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా ఈనెల 9న అన్ని గ్రామాలలో జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. నిర్దేశించిన అంశాలకు సంబంధించిన ఆయా శాఖల్లో పురోగతిని అధికారులు నిశితంగా పరిశీలించాలన్నారు.

శాశ్వత ధ్రువపత్రాలు సిద్ధం చేయాలి..

ఇళ్ల స్థలాల దరఖాస్తుల నమోదు ప్రక్రియ తక్షణమే పూర్తి చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. రీ సర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో రోవర్స్ యంత్రాలు వినియోగించి శాశ్వత ధ్రువపత్రాలు సిద్ధం చేయాలన్నారు. ఇందుకోసం జిల్లాకు విడుదలైన రూ.80 లక్షల నిధులను వినియోగించుకోవాలన్నారు. జిల్లాకు ఒక లక్ష ఆయుష్మాన్ భారత్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చాయని, వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆర్డీఓలు, ఎంపీడీఓలను ఆయన ఆదేశించారు. ఈనెల 9న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేకంగా రూపొందించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ విడుదల చేశారు.

పట్టుదలతోనే విజయం సాధ్యం



ఖోఖోలో ప్రథమస్థానంలో నిలిచిన జె.పంగులూరు మహిళా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

- క్రీడాకారులు బాపట్ల జిల్లా కీర్తిని ఇనుమడింపచేయాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- ఉత్సాహంగా ముగిసిన ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేత

బాపట్ల: క్రీడాకారులు బాపట్ల జిల్లా కీర్తిని మరింత ఇనుమడింపజేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి ముగింపు కార్యక్రమం సోమవారం స్థానిక బాపట్ల ఉన్నత పాఠశాల మైదానంలో జరిగింది. గడిచిన మూడు రోజులుగా నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీలలో విజేతలైన వారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా షీల్డ్‌లు, పతకాలు అందజేశారు. క్రీడారంగంలో పట్టుదలతోనే విజయాలు సాధ్యమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. క్రీడలను ప్రోత్సహించడానికి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడలలో పోటీలు జరిగాయన్నారు. జిల్లాస్థాయిలో 28 టీంలు తల పడ్డాయన్నారు. అట్టహాసంగా ప్రారంభమైన క్రీడలు జిల్లాలో ముగిశాయని విజేతలైన వారు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొంటారని చెప్పారు. యువతీ, యువకులంతా క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని బాపట్ల జిల్లా ప్రతిష్టను మరింత అధికం చేయాలన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలు జిల్లాలో జయప్రదం అయ్యేలా జిల్లా యంత్రాంగం విశేషంగా కృషి చేసిందని తెలిపారు.

జిల్లాస్థాయిలో తలపడిన 114 మంది క్రీడాకారులు..

క్రీడాస్ఫూర్తితో యువతీ యువకులు ముందుకు సాగాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. జిల్లాస్థాయిలో 114 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. గ్రామ సచివాలయాల నుంచి క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ, బృందాల ఏర్పాటు, క్రీడా సామగ్రి సేకరణ ప్రక్రియలో జిల్లా యంత్రాంగం విశేషంగా కృషి చేసిందని ప్రత్యేకంగా అభినందించారు.

విజేతల వివరాలు..

ఖో..ఖో క్రీడలో బాలుర విభాగంలో ప్రథమ బహుమతి జె.పంగులూరు జట్టు సాధించగా, ద్వితీయ బహుమతి బాపట్ల జట్టు, తృతీయ బహుమతి బాపట్ల మండలం యాజలి జట్టు కైవసం చేసుకుంది. ఖో ఖో బాలికల విభాగంలో ప్రథమ బహుమతి బాపట్ల, ద్వితీయ బహుమతి పర్చూరు జట్టు సొంతం చేసుకున్నాయి. కబడ్డీ బాలుర విభాగంలో పర్చూరు జట్టు ప్రథమం, బాపట్ల జట్టు ద్వితీయ స్థానం, చీరాల జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. కబడ్డీ బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో బాపట్ల, ద్వితీయ స్థానంలో వేమూరు, తృతీయ స్థానంలో అద్దంకి జట్లు నిలిచాయి. వాలీబాల్ బాలుర విభాగంలో ప్రథమ బహుమతి బాపట్ల జట్టు, ద్వితీయ బహుమతి చీరాల, తృతీయస్థానం రేపల్లె జట్టు సొంతం చేసుకున్నాయి. వాలీబాల్ బాలికల విభాగంలో రేపల్లె జట్టు ప్రథమ స్థానంలో, బాపట్ల జట్టు ద్వితీయ స్థానంలో, అద్దంకి జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. క్రికెట్‌లో చీరాల జట్టు ప్రథమ స్థానం సొంతం చేసుకుంది. బ్యాడ్మింటన్ క్రీడలో పర్చూరు జట్టు ప్రథమ స్థానంలో చీరాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నాయి. విజేతలకు జిల్లా కలెక్టర్, జిల్లా సంయుక్త కలెక్టర్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ కె.పాల్ కుమార్, గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, బ్రాండ్ అంబాసిడర్ శివ నాగిరెడ్డి, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి

- అర్చకులకు వంశపారంపర్య హక్కులు కల్పించిన ముఖ్యమంత్రి
- వైఎస్సార్ సీపీ అద్దంకి సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- శింగరకొండలో అర్చకుల ఆత్మీయ సమావేశం



అర్చకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: రాష్ట్రంలో అర్చకుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని.. ఏ సమస్య వచ్చినా ఒక్క ఫోన్‌కాల్ చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శింగరకొండ దేవస్థానం సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి అర్చక సమాఖ్య ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు ఎం.జానకి రామయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హనిమిరెడ్డి మాట్లాడుతూ అర్చకులు దైవాంశ సంభూతులన్నారు. ప్రతి కార్యక్రమాన్ని ముందుండి నడిపించేది అర్చకులే అన్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్చకులకు వంశపారంపర్య హక్కును కల్పించి, వారి అభ్యున్నతికి పాటు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలోని అర్చకులకు ఎటువంటి సమస్య వచ్చినా మధ్యవర్తులు లేకుండా నేరుగా తనవద్దకు రావచ్చన్నారు. తాను నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. రాబోయే ఎన్నికల్లో అద్దంకిలో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలన్నారు. అనంతరం శింగరకొండ దేవస్థాన ఏసీ టి.సుభద్ర, అర్చకులు చిన హనిమిరెడ్డిని దుశ్శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో తొలుత శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థానంలో పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, శింగరకొండ దేవస్థాన అర్చకులు, నియోజకవర్గ అర్చకులు, నాయకులు పాల్గొన్నారు.



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో పూజలు చేస్తున్న చిన హనిమిరెడ్డి

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు

అడిషనల్ డీపీఎం మోహన్

బల్లికురవ: ప్రకృతి వ్యవసాయంతో పండ్లు, ఆకుకూరలతో ఆరోగ్యవంతమైన పంటలు పండుతాయని ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ నేచురల్ ఫార్మింగ్) అడిషనల్ డీపీఎం మోహన్ అన్నారు. సోమవారం బల్లికురవలో పండ్లు కూరగాయలను ప్రదర్శించారు. ఈసందర్భంగా మోహన్ మాట్లాడుతూ ఏటీఎం మోడల్‌లో ప్రతి గ్రామంలోని మహిళలు పండ్లు, కూరగాయల సాగుతో ఇంటి అవసరాలు తీర్చుకోవచ్చని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంతో పండించే పంటలతో ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులు వాడరని కేవలం కషాయాలను మాత్రమే వినియోగిస్తారని చెప్పారు. మండలంలో పది పంచాయతీల్లో ప్రకృతి పద్ధతిలో సాగు జరుగుతోందన్నారు. అన్ని పంచాయతీలు, శివారు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు అవలంభించాలని కోరారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ప్రదర్శిస్తూ అమ్మకానికి అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. యూనిట్ ఇన్‌చార్జి సీహెచ్ కల్పన, నాగాంజలి, వెంకట్రావు, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రాంబాబు, ఈఓఆర్‌డీ సుమతి, పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త వెంకటేష్

చీరాల టౌన్: యువత క్రీడల్లో రాణించడం వల్ల శారీరక ధృఢత్వం పెరగడంతో పాటు స్పోర్ట్స్ కోటాలో సులభంగా ఉద్యోగాలు పొందవచ్చని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ సూచించారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వేటపాలెం మండలం బచ్చులవారిపాలెం యువ క్రీడాకారులకు నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్ వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి, సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. ఉత్తమ క్రీడాకారులను తయారు చేసేందుకే ఆడుదాం ఆంధ్రా క్రీడల సంబరాన్ని సీఎం జగన్ పటిష్టంగా నిర్వహిస్తున్నారన్నారు. యువత చదువుతో పాటుగా క్రీడల్లో రాణిస్తే సులభంగా ఉద్యోగాలు పొందవచ్చన్నారు. వాలీబాల్ ఆటల్లో మెలకువలు నేర్చుకుని చక్కని ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వేటపాలెం యూత్ అధ్యక్షుడు అశోక్, శ్రీను, నాగార్జున, సురేష్, భవానీసాయి, రాజు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కరణం

నరసరావుపేట ఆర్డీఓగా సరోజిని



ఆర్డీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

నరసరావుపేట: నరసరావుపేట రెవెన్యూ డివిజనల్ అధికారిగా పి.సరోజిని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో ఆమె చీరాల నుంచి నరసరావుపేట వచ్చారు. కాగా, ఇక్కడ పనిచేసిన ఎం.శేషిరెడ్డి కర్నూలు ఆర్డీఓగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సరోజినిని ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

అర్జీల పరిష్కారం సంతృప్తికరంగా ఉండాలి

- ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశం
- పోలీసు స్పందనకు 49 ఫిర్యాదులు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల అర్బన్: స్పందన అర్జీలు పునరావృతం కాకుండా సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 49 ఫిర్యాదులు అందాయి. వరకట్న వేధింపులు, కుటుంబ సమస్యలు, భూవివాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఇతర సమస్యలతో మొత్తం 49 మంది అర్జీదారులు వారి సమస్యలను ఎస్పీకు విన్నవించారు. ఫిర్యాదిదారులు సమస్యలను కూలంకషంగా విని, వారి అర్జీలను పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా ఫిర్యాదిదారుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. 'స్పందన' కార్యక్రమంలో వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా చట్టపరిధిలో విచారించి సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని ఎస్పీ పోలీస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు, డి.సి.ఆర్.బి ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

చీరాల ఆర్పీఎఫ్ కమాండర్ సీఐ



తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసరావు, షాడోస్ సంస్థ ప్రతినిధి రాజా సాల్మన్

చీరాల రూరల్: మానవ అక్రమ రవాణాలకు పాల్పడినా, కార్మికులను వెట్టిచాకిరీ చేయించి బానిసలుగా మార్చినా చట్ట పరిధిలో కఠిన చర్యలు తీసుకుంటామని చీరాల ఆర్పీఎఫ్ కమాండర్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. షాడోస్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో సంస్థ ఛైర్మన్ రాజా సాల్మన్ రైల్వే స్టేషన్‌లో 'బాండెండ్ లేబర్ హ్యూమన్ ట్రాఫికింగ్' గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్ ఆవరణలో బాండెడ్ లేబర్, హ్యూమన్ ట్రాఫికింగ్ గురించి అనుమానాస్పదంగా ఉన్న వారిని తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చీరాలలో పరిశ్రమలు, వస్త్ర దుకాణాలు ఎక్కువగా ఉన్నందున చీరాలకు అనేక వేలమంది ప్రతిరోజు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. అంతేకాక పనుల కోసం కూడా చీరాలకు వస్తుంటారని చెప్పారు. అటువంటి వారిపై ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడినా, వారిని బానిసలుగా మార్చి వెట్టిచాకిరీ చేయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైళ్లలో, రైల్వే స్టేషన్‌లో కానీ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో షాడోస్ సంస్థ ఛైర్మన్ రాజా సాల్మన్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక చేయూత అందించాలి

కలెక్టర్ పి.రంజిత్ బాషా

బాపట్ల అర్బన్: విశ్వకర్మ యోజన ద్వారా పేదలకు ఆర్థిక చేయూతనందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా స్పష్టం చేశారు. విశ్వకర్మ యోజనపై మునిసిపల్ కమిషనర్లతో సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. చేతి వృత్తులను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం విశ్వకర్మ యోజనను అమలు చేస్తుందన్నారు. వంశపారంపర్యంగా వస్తున్న చేతి వృత్తుల వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందనీ, జిల్లాలోని బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె పట్టణాల నుంచి 422 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎంపిక చేసిన 8 రంగాల్లో వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించిన తదుపరి అర్హుల వివరాలను ప్రభుత్వానికి పంపాలన్నారు. సంప్రదాయ వృత్తులను ఆదుకోవడానికి ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఒక లక్ష రుణాలను పంపిణీ చేస్తుందన్నారు. అద్దంకి నుంచి 69 దరఖాస్తులు రాగా, బాపట్ల నుంచి 118 దరఖాస్తులు వచ్చాయన్నారు. చీరాల నుంచి 166 దరఖాస్తు రాగా మిగిలినవి రేపల్లె మున్సిపాలిటీ నుంచి వచ్చాయని వివరించారు. ప్రాథమికంగా ధ్రువపత్రాలను పరిశీలించి రెండు రోజుల్లో నివేదిక పంపాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు కె.అర్జున్ నాయక్, పరిశ్రమల శాఖ జీఎం రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

భావపురిలో ఆరామ క్షేత్ర భవన నిర్మాణం

రూ.కోటితో నిర్మాణానికి బ్రాహ్మణ సమాఖ్య తీర్మానం



సమాఖ్య సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: భావపురి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో అశోక కన్వెన్షన్ హాల్‌లో అధ్యక్షుడు శ్రీహరి ప్రకాష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. సమావేశానికి విశిష్ట అతిథిగా ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొన్నారు. సుమారు రూ.కోటితో ఆరామ క్షేత్ర భవన నిర్మాణానికి కమిటీ తీర్మానం చేసింది. ఈ నెల 14 శంకుస్థాపన చేయడానికి సమావేశంలో తీర్మానం చేశారు. ఎమ్మెల్యే కోనా రఘుపతి ఇచ్చిన ఫండ్స్ నుంచి సుమారు పది మందికి ఒక్కొక్కరికీ రూ. లక్ష చొప్పున సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కాలనీలో గృహాలు నిర్మించుకున్న వారికి మలి విడత పనులు పూర్తిచేసుకుని గృహప్రవేశం చేసుకునేందుకు వీలుగా చెక్కుల రూపంలో వారికి నగదు అంద చేశారన్నారు. సంక్రాంతి లక్ష్మీ కార్యక్రమంలో భాగంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి, బొమ్మల కొలువులు ఏర్పాటు చేసిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో సోమరాజు శ్రీనివాస్, నారాయణ, మోహన శ్రీనివాసు, రాఘవస్వామి శ్రీకాంత్, కోదండ రామారావు, హరినాథ్ శర్మ, గూడ వెంకట భట్టు, కార్యవర్గ సభ్యులు బ్రాహ్మణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

అధికారులకు జేసీ జి.రాజకుమారి ఆదేశం

గుంటూరు వెస్ట్: మార్చి 1 నుంచి 20 వరకు జరగనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఉంటాయని తెలిపారు. ఫిబ్రవరి 11 నుంచి 20 వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్ నిర్వహిస్తామని వెల్లడించారు. వీటికి 24,334 మంది హాజరు కానున్నారని, 113 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ప్రథమ, ద్వితీయ ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 2,042 మంది హాజరవుతారని, 11 కేంద్రాల్లో ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు మూడు దఫాల్లో నిర్వహిస్తామని వివరించారు. వేసవి ప్రారంభం దృష్ట్యా కేంద్రాల్లో విద్యార్థులు తాగునీటి సదుపాయంతో పాటు ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ వద్దని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో వాల్ క్లాక్స్‌తోపాటు సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ బోర్డ్ ఆర్ఈఓ జేకే జుబర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, కె.స్వాతి, రవీంద్రరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

9నుంచి నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా ఈనెల 9న నిర్వహించనున్న నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నూరు శాతం విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సున్న వారు 4,72,534 మందిని గుర్తించామని వెల్లడించారు. వీరందరికీ ఆల్బెండాజోల్ మాత్రలను ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెట్ పాఠశాలు, కళాశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ మింగించాలని ఆదేశించారు. చిన్నారులు, బాలల ఆరోగ్యం కోసం ప్రతి ఏడాది ఫిబ్రవరి, ఆగస్ట్ నెలల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. నులిపురుగులను నియంత్రిస్తే చాలా రోగాల్ని అరికట్టవచ్చని చెప్పారు. జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఏ.శ్రావణ్ బాబు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నులిపురుగుల నివారణ ఆవశ్యకతను వివరించారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాలలోపు పిల్లలకు సగం మాత్రను నీళ్లల్లో కలిపి తాగించాలని, 2-19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర వేయాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, కె.స్వాతి, రవీంద్రరావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు సాయిభాస్కర్‌లో రోబోటిక్ సర్జరీలు

విలేకరుల సమావేశంలో డాక్టర్ నరేంద్రరెడ్డి



కీళ్ల ఆపరేషన్ రోబోటిక్‌తో చేసే విధానాన్ని వివరిస్తున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్: ప్రపంచ వ్యాప్తంగా రోబోటిక్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అన్ని విభాగాల్లో అందుబాటులోకి వచ్చిందని గుంటూరు సాయిభాస్కర్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్ అధినేత, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని సాయిభాస్కర్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లలో రెండు నుంచి మూడు శాతం ఫెయిల్యూర్స్ ఉంటాయని, అవి కూడా లేకుండా నూటికి నూరు శాతం మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ విజయవంతం చేయడంలో రోబోటిక్ ఆపరేషన్లు కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు. తమ హాస్పిటల్‌లో 150 మందికి పైగా రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు విజయవంతంగా చేశామని చెప్పారు. ఏపీలోనే మొట్టమొదటిసారిగా ఫుల్లీ ఆటోమ్యాటిక్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు తమ ఆసుపత్రిలో చేస్తున్నామని తెలిపారు. రోబోటిక్ సర్జరీ ద్వారా పరికరాల వినియోగం చాలాతక్కువగా ఉంటుందని, తద్వారా ఇన్‌ఫెక్షన్ సోకదని పేర్కొన్నారు. రక్తం పోవడం చాలా తక్కువగా ఉంటుందని, నొప్పి ఉండదని, త్వరగా రోగి కోలుకుంటాడని, జాయింట్ల కాలపరిమితి కూడా ఎక్కువ కాలం ఉంటుందని వివరించారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం వేంపాడు గ్రామానికి చెందిన 63 సంవత్సరాల గుప్తా సుబ్బారావుకు 16 ఏళ్లుగా మోకీళ్ల సమస్య ఉండి, ఎడమ కాలు పూర్తిగా వంగిపోయిందన్నారు. గుంటూరు అమరావతి రోడ్డుకు చెందిన 72 సంవత్సరాల జ్ఞానసుందరికి కుడికాలు తీవ్రమైన నొప్పి ఉండటంతో వీరిద్దరికి నవంబరు 2న రోబోటిక్ సాయంతో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా చేశామని డాక్టర్ నరేంద్రరెడ్డి వెల్లడించారు.

మాయ మాటలకు మారుపేరు చంద్రబాబు



దుర్గిలో ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి

దుర్గి: మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు మాయ మాటలతో మోసగించిన వ్యక్తి చంద్రబాబు నాయుడ అని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ సోమవారం నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు పూర్తి రుణమాఫీ చేసిన చరిత్ర వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కిందని చెప్పారు. పవన్ కళ్యాణ్, షర్మిలను ప్రోత్సహిస్తూ సీఎం వైఎస్ జగన్‌పై నిరాధారమైన ఆరోపణలు చేయిస్తోందని చంద్రబాబే అని పీఆర్కే ఆరోపించారు. క్లిష్ట పరిస్థితిలో ఉన్న రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సంక్షేమ పథకాలు అందిస్తూ ముందుండి నడిపించింది సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, ఏఎంసీ చైర్మన్ వి.గోపాల్, ఎంపీపీ ఏచూరి సాయి శంకర్, జెడ్పీటీసీ సభ్యుడు శెట్టిపల్లి యలమంద, వైస్ ఎంపీపీలు ఊరిబిండి ఏగయ్య, చల్లా శ్రీనివాస్, పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయి, యూత్ విభాగం కన్వీనర్ వై.బుచ్చిబాబు, పీఏసీస్ చైర్మన్ కె.రామారావు, మాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, వైఎస్సార్ సీపీ నాయకులు కె.వెంకటయ్య, సర్పంచి ఆర్.మాణిక్యం, ఎంపీటీసీలు కె.గోపాల్, సీతా గోవింద్, చింతా నరసింహారావు, నాలి రామయ్య, బత్తుల శ్రీనివాసరావు, జె.కొండలు, ఎం.శ్రీనివాసరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, శాంత రమేష్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై దృష్టి సారించండి



ఎస్పీ రవిశంకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్

నరసరావుపేట: ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లా ఎస్ఈబీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన షేక్ ఖాజామొహిద్దీన్, సత్తెనపల్లి డీఎస్పీ జీసీ గురునాథబాబు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఖాజామొహిద్దీన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజు శాఖలో 25 ఏళ్ల పాటు ప్రకాశం జిల్లాలో సీఐగా బాధ్యతలు నిర్వహించారు. అసిస్టెంట్ ఎక్సైజు సూపరింటెండెంట్‌గా పదోన్నతిపై ఒంగోలు ఐఎంఎల్ డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేశారు. పదోన్నతిపై నరసరావుపేటకు సూపరింటెండెంట్‌గా వచ్చారు. విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి సారించి ప్రజల రక్షణ, భద్రతకు కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సత్తెనపల్లి డీఎస్పీ జీసీ గురునాథ్ బాబు అన్నారు. డీఎస్పీగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ డీఎస్పీగా పని చేసిన బి.ఆదినారాయణ తూర్పుగోదావరి దిశ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా సోమవారం రిలీవ్ అయ్యారు. బాధ్యతలు తీసుకున్న గురునాథ్ బాబు 1991 బ్యాచ్ ఎస్ఐగా అనంతపురం జిల్లాలో విధుల్లో చేరారు. 2005లో సీఐగా ఉద్యోగోన్నతి పొంది రైల్వేలో పని చేశారు. 2014లో డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. అనంతరం రాజమండ్రి నేర విభాగంలో పనిచేస్తూ సత్తెనపల్లి డీఎస్పీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో ప్రశాంతంగా ఎన్నికలు జరిపేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా విధులు నిర్వహిస్తామన్నారు. డీఎస్పీని పట్టణ సీఐ పి.ప్రభాకర్, సత్తెనపల్లి రూరల్ సీఐ మీసాల రాంబాబు, అమరావతి సీఐ ఏవీ బ్రహ్మం, ఎస్ఐలు ఎం.సంధ్యారాణి, ఎం.సత్యనారాయణ, పైడి రాంబాబు, పి.హజరత్తయ్య మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- నంబూరులో జగన్నామ సంక్షేమ సంగమం ద్వారా 1210 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షల కోసం వచ్చిన నంబూరు గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ కొనియాడారు. మండలంలోని నంబూరులో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు రెండో రోజు సోమవారం ముగిశాయి. నేత్ర, గుండె పరీక్షలను 1,210 మంది వినియోగించుకున్నారు. అవసరమైన వారికి ఫిజియోథెరపీ సేవల్ని కూడా అందజేశారు. గుండె పరీక్షల అనంతరం వైద్యులు 18 మందికి యాంజియోగ్రామ్ అవసరమని సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అమ్మఒడి, ఆరోగ్యశ్రీ , రైతు భరోసా, జగనన్న విద్యాదీవెన వంటి అనేక పథకాలతో పేదరికం నిర్మూలిస్తున్న నిజమైన ప్రజాయోధుడు వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి అని తెలిపారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. పేదల ఇంటి ముందుకే సంక్షేమ ఫలాల్ని అందివ్వడాన్ని పవిత్ర కార్యంగా భావిస్తూ ముందుకు సాగుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్ అంకితభావంతో ప్రజా సేవను కొనసాగిస్తుందని వివరించారు. ఏడాది నుంచి బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో కంటి సమస్యల నివారణకు నేత్రజ్యోతి కార్యక్రమం ద్వారా ఉచిత పరీక్షలు చేసి అవసరమైన వారికి ఏడు పని దినాల్లో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. మీ గుండె పదిలం కార్యక్రమం ద్వారా ఉచిత గుండె పరీక్షలు, అవసరమైన వారికి యాంజియోగ్రామ్ నిర్వహించి సమస్య ఉన్న వారికి స్టంట్స్, బైపాస్ సర్జరీలు చేయిస్తున్నట్టు వివరించారు. దివ్యాంగ దర్శిని కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, జైపూర్ కాళ్లు, వెస్టర్న్ కమోడ్‌లు అందిస్తున్నట్టు తెలిపారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులను వైద్య శిబిరానికి ప్రత్యేక వాహనాల ద్వారా తీసుకువచ్చి పరీక్షలు నిర్వహించి అదే వాహనంలో ఇంటికి పంపడంపై హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు.

గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా పలు రైళ్లు రద్దు

డీసీఎం డాక్టర్ సీహెచ్ ప్రదీప్ కుమార్

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే సికింద్రబాద్ డివిజన్‌లోని మౌలాలి-అమ్ముగూడ-సనత్‌నగర్ మధ్య నాన్ ఇంటర్ లాకింగ్, ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా గుంటూరు డివిజన్ నుంచి అటుగా ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేయడం జరిగిందని డీసీఎం డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్ సోమవారం తెలిపారు.గుంటూరు-సికింద్రబాద్(12705), సికింద్రబాద్-గుంటూరు(12706), గుంటూరు-వికారబాద్(12747), వికారబాద్-గుంటూరు(12748), రేపల్లె-సికింద్రబాద్(17646), సికింద్రబాద్-రేపల్లె(17645) రైళ్లు సోమవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు రద్దు చేయడం జరిగిందని తెలిపారు. నడికుడి-మిరియాలగూడ(07973), మిరియాలగూడ-కాచిగూడ(07974), కాచిగూడ-రేపల్లె(17625), రేపల్లె-సికింద్రబాద్(17626) రైళ్లు గత ఆదివారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు, కాచిగూడ-మిరియాలగూడ(07276), మిరియాలగూడ-నడికుడి(07277) రైళ్లు గత శనివారం నుంచి ఈ నెల 9వ తేది వరకు రద్దు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే గుంటూరు-సికింద్రబాద్(17201) రైలు ఖాజీపేట-సికింద్రాబాద్ మీదుగా సోమవారం నుంచి ఈ నెల 11వ తేది వరకు, సికింద్రబాద్-గుంటూరు(17202) రైలు సికింద్రబాద్-ఖాజీపేట మీదుగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు చెప్పారు. ప్రయాణికులు గమనించి సురక్షితమైన ప్రయాణం చేయాల్సిందిగా తెలిపారు.